
# సత్యవాక్యం

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

MARCH - 2005

# సంక్షిప్త వార్తలు

2005 జనవరి 8వ తేదీ శనివారం తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం బలభద్రపురంలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు హర్షల్ బియర్డెన్ గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్ఠ చేసిరి. జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరై స్థానిక సంఘస్థులను అభినందించిరి. బలభద్రపురంలో బంగారు జోసఫ్ గారు సువార్త పనిచేయు చున్నారు. 2005 జనవరి 9వ తేదీ ఆదివారం ఉదయం పెదపూడి మండలం గండ్రేడులో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు రోయస్ ఫ్రెడరిక్ గారు ప్రతిష్ఠచేసిరి. తదుపరి ఆరాధనలో వాక్యపరిచర్య చేసిరి. రోయస్ గారి సతీమని సూజీ గారును, కబితా గూటంగారును ఆ కార్యక్రమములో పాల్గొనిరి. గండ్రేడులో సోదరులు సింగవరపు జాన్ గారు సువార్త చాటుచున్నారు.

జనవరి 9వ తేదీ ఆదివారం సాయంత్రం కోరుకొండ మండలం నల్లగొండలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు రోయస్ ఫ్రెడరిక్ గారు సతీసమేతముగా రిబ్బను కత్తిరించి ప్రతిష్ఠ చేసిరి. వాక్యపరిచర్య చేసిరి. తదుపరి 11మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. నల్లగొండలో సోదరులు బి. ధర్మరాజుగారు సువార్తికునిగా పనిచేయుచున్నారు. 2005 జనవరి 28వ తేదీ శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు హనుమాన్ నగర్‌లో నిర్మించబడిన ఆలయమును రోయస్ గారు దేవుని సేవ కొరకై ప్రతిష్ఠ చేసిరి. పాలకొల్లు హనుమాన్ నగర్‌లో సోదరులు జి. షడ్రక్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

పైనుదహరించిన క్రీస్తు సంఘ ఆలయములన్నియును సోదరులు జాషువా గూటం గారి పర్యవేక్షణలో నిర్మించబడెను.

2005 ఫిబ్రవరి 16వ తేదీ బుధవారం ఏలేశ్వరం దగ్గరనున్న లింగంపర్తి గ్రామములో ఏర్పాటు చేయబడిన కూటములో జాషువాగూటం గారు వాక్యపరిచర్య చేసిరి. హైందవ కుటుంబములలో నుండి వచ్చిన వారిలో ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. లింగంపర్తిలోను, ఉలిమేశ్వరంలోను సోదరులు శ్రీమంతుల రాజుగారు సువార్త చాటుచున్నారు.

ఫిబ్రవరి 24, 25వ తేదీలలో కోటిపల్లి కోటలో జరిగిన రెండు రోజుల బైబిలు క్లాసులలో సోదరులు బాజీ ఆల్బర్ట్, సుకేష్ రాజా, పి. అబ్రాహాము గార్లు

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH


P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722
Editor :
**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 25 | మార్చి 2005 | సంచిక 8


# బాప్తిస్మమును గూర్చిన మరికొన్ని ప్రశ్నలు

**(More Questions about Baptism)**

బాప్తిస్మము అనగా నీటిలో ముంచుట యనియు, చిలకరింపు, కుమ్మరింపు అనునవి మానవులు కల్పించిన పద్ధతులనియు, మారుమనస్సు పొందిన విశ్వాసులు బాప్తిస్మమున కర్హులనియు, పసిబిడ్డల బాప్తిస్మము బైబిలు పద్ధతి కాదనియు మనము నేర్చుకొంటిమి. ఈరోజు బాప్తిస్మమును ఎప్పుడు ఎక్కడ పొందవలెను? అను ప్రశ్నలకు బైబిలును బట్టి జవాబులను కనుగొందము.

క్రీస్తు నందు విశ్వాసులై, సద్వర్తన కలిగి ఇంకను బాప్తిస్మము పొందకుండా ఉన్నవా రనేకులున్నారు. వారి దృష్టిలో బాప్తిస్మము అంత ప్రాముఖ్యమైనది కాదు. నిజానికి వారిలో అట్టి మనస్తత్వ మేర్పడినది అంటే వారి బోధకులదే పొరబాటు అని మనము అనుకొనవచ్చును. బాప్తిస్మము యొక్క ప్రాముఖ్యతను బోధకుడే ఎరుగని

యెడల దానిని అతడెట్లు బోధించగలడు? గత కొద్ది పాఠములలోను రక్షణ పొందుటకు బాప్తిస్మము అవుసరము అని మనము దైవవేదము ద్వారా నేర్చుకొంటిమి గదా. అందువలన ఒకడు బాప్తిస్మము ఎప్పుడు పొందవలెను? అని బైబిలును అడుగుదాం.

మొదటి శతాబ్దములో అపొస్తలులు రక్షణ సువార్తను బోధించుచూ చేసిన కార్యములను గూర్చి "అపొస్తలుల కార్యములు" అనే పుస్తకము మనకు క్రొత్త నిబంధన యందున్నది. అందులో రక్షింపబడిన వారిని గూర్చిన సందర్భములు అనేకములున్నవి. వాటిని మనము చూచిన యెడల యేసువైపు మార్చబడిన వారెవరూ బాప్తిస్మము పొందుటకు ఆలస్యము చేయలేద గ్రహించగలము.

పెంతెకోస్తు నాడు, యేసునందు విశ్వసించినవారు బాప్తిస్మము కొరకు కనిపెట్టలేదు. ఆ జనసమూహములు పేతురు చేసిన సువార్త ప్రసంగమును వినిరి. హృదయములో నొచ్చుకొనినవారై మేమేమి చేయవలెనని పేతురును, అపొస్తలులను అడిగిరి. వారు మారుమనస్సు పొంది, బాప్తిస్మము పొందవలెనని పేతురు వారికి జవాబిచ్చెను. అప్పుడు అతని వాక్యము నంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. అప్పుడనగా ఎప్పుడు? ఆ దినమందే ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి (అపొ.కా. 2:36-41).

ఫిలిప్పు అను సువార్తికుడు సమరయ పట్టణము వరకు వెళ్ళి సువార్తను బోధించెను. జనసమూహములు అతడు చెప్పిన మాటల యందు ఏకమనస్సుతో లక్ష్యముంచిరి. వారతనిని నమ్మి, పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందిరి. అప్పుడు సీమోను అను గారడీవాడు కూడ నమ్మి బాప్తిస్మము పొందెను (అపొ.కా. 8:5-13). ఇక్కడ సమరయులు గాని, గారడీవాడైన సీమోను గాని బాప్తిస్మము పొందుటకు దినముల తరబడి కనిపెట్టక తక్షణమే ఆ క్రియను జరిగించినట్లు చూడగలము.

రధములో ప్రయాణించుచున్న ఒక నపుసంకునికి ఫిలిప్పు సువార్తను బోధించెను. వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న ఒకచోటికి వచ్చినప్పుడు ఆ నపుంసకుడు ఇదిగో, నీళ్ళు, నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగెను. ఫిలిప్పు అతనికి తక్షణమే, మార్గమధ్యములోనే బాప్తిస్మమిచ్చెను (అపొ.కా. 8:35-39). ఈ నపుంసకుడు బాప్తిస్మము పొందుట కొరకు ఏమియు కనిపెట్టలేదు.

పౌలు బాప్తిస్మము పొందుటకు

ఏమియు కనిపెట్టలేదు. అననీయ అను తనతడు పౌలుకు క్రీస్తు సువార్తను బోధించెను. "నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్ధన చేసి, బాప్తిస్మము పొంది నీ పాపములు కడుగు కొనుమని" అతడు పౌలుకు బోధించగా (అపొ.కా. 22:16), అతడు వెంటనే లేచి బాప్తిస్మము పొందెను (అపొ.కా. 9:18).

ఫిలిప్పయి చెరసాల అధిపతి, అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెనని పౌలు, సీలాలను మధ్య రాత్రివేళ అడిగెను. అంతేకాదు, వారు అతనికిని, అతని యింట నున్న వారికందరికిని దేవుని వాక్యము బోధించిరి. రాత్రి ఆ గడియలోనే అతడును, అతని యింటి వారందరును బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 16:23-24). తెల్లవారే వరకయినను వారు కనిపెట్టలేదు.

పౌలు ఎఫెసునకు వచ్చినప్పుడు యేసుక్రీస్తు ఆజ్ఞాపించిన బాప్తిస్మమును ఎరుగని కొందరి శిష్యులను కనుగొని వారికి యేసును గూర్చి బోధించెను. వారు ఆ మాట విని ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 19:1-5). వారు కనిపెట్టలేదు గాని తక్షణమే బాప్తిస్మము పొందిరి.

అపొస్తలులు సువార్తను బోధించుచుండగా ఎవరయితే విశ్వాసమును వ్యక్తపరచిరో వారు బాప్తిస్మము కొరకు కనిపెట్టలేదు. అట్టివారు తక్షణమే బాప్తిస్మము పొందిరి. ఏలయనగా ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము అని దైవవేదము చెప్పుచున్నది (2 కొరింథీ 6:2). దేవుని వాక్యము ఈ విషయములో మనకు ఇంత విపులముగా బోధించుచున్నప్పుడు బాప్తిస్మము పొందుటకు మీరు ఎందుకు వెనుకంజ వేయుదురు? మూర్ఖులగు ఈతరము వారికి వేరై రక్షణ పొందవలెనంటే అది ఈనాడు మీకు సాధ్యమేయని గ్రహించవలెను.

బాప్తిస్మమును ఎక్కడ పొందవలెను? అనునది మరొక ప్రశ్న. బాప్తిస్మము ఒకనీటి సమాధిని సూచించు చున్నది గనుక ఆ క్రియను జరిగించుటకు ఒక స్థలము అవుసరమయి యున్నది. అంతేకాకుండా అది నీరున్న స్థలమయి యుండవలెను. బాప్తిస్మమిచ్చువాడు, పొందగోరువాడు కూడా నీటియొద్దకు రావలెను (అపొ.కా. 8:36). వారిద్దరు నీటిలోనికి దిగవలెను (8:38). అప్పుడా నీటిలో ముంచడము జరుగవలెను. బాప్తిస్మము వలన క్రీస్తు మరణములో పాలు పొందుటకై ఆయనతో

కూడ పాతిపెట్టబడితిమి యని పౌలు చెప్పుచున్నాడు (రోమా 6:4). నీటిలో ముంచడమయిన తరువాత నీటిలో నుండి వెడలి వచ్చుట జరుగవలెను (అపొ.కా. 8:39). గనుక మనుష్యులు నీటిలో ముంచబడి లేవదీయబడుటకు సరిపడినంత నీరు ఎక్కడ ఉన్నదో, అక్కడ బాప్తిస్మమును జరిగించవలెను.

అందువలననే యోహాను యోర్దాను నదిలో బాప్తిస్మమిచ్చు చుండెను (మత్తయి 6:3). అంతేకాదు, "సలీము దగ్గర నున్న ఐనోనను స్థలమున నీళ్ళు విస్తారముగా ఉండెను గనుక యోహాను కూడ అక్కడ బాప్తిస్మమిచ్చు చుండెను; జనులు వచ్చి బాప్తిస్మము పొందిరి" యని యోహాను 3:23 చెప్పుచున్నది. గనుక వాక్యప్రకారమైన బాప్తిస్మము విస్తారమైన నీళ్ళున్నచోట జరుగవలెను.

దేవుని వాక్యము బోధించుచున్న బాప్తిస్మమునకును, మనుష్యులు కల్పించిన ఆచారమయిన చిలకరింపునకును ఎంత వ్యత్యాసమున్నదో మనము ఇట్టే గమనించగలము. బాప్తిస్మమును పొందువాడు నీటియొద్దకు వచ్చినట్లు వాక్యము చెబితే, చిలకరింపు జరిగించుటలో నీరు అతని యొద్దకు తేబడుచున్నది. ఇది వాక్యానికి ఎంత ఖచ్చితముగా విరుద్ధమో గమనించండి. బాప్తిస్మము పొందువాడు నీటిలోనికి దిగి ముంచబడుటను గూర్చి వాక్యము చెప్పుచుండగా, చిలకరింపు గాని, కుమ్మరింపుగాని పొందువాడు నీటిలో దిగే సమస్యే లేదు. ఇది వాక్యమునకు ఎంత విరుద్ధమో గమనించండి. వాక్య ప్రకారమయిన బాప్తిస్మములో యేసు యొక్క సమాధి, పునరుత్థానముల సాదృశ్యము మనకు కన్పడుచుండగా చిలకరింపులో అట్టి వేమియును లేనేలేవు. అది దైవవాక్యమునకు ఎంత విరుద్ధమో గమనించండి. ముంచడమయిన తరువాత నీటిలో నుండి వెడలి వచ్చుటను గూర్చి బైబిలు చెప్పుచుండగా చిలకరింపులో, నీటిలోనికి ఎవడు దిగనిదే దానిలో నుండి ఎట్లు వెడలి రాగలడు?

దీనిని బట్టి చిలకరింపు, కుమ్మరింపు అను మానవాచారములు దైవప్రేరితమైన ఆజ్ఞలు కావు అని తేటపడినది. బైబిలు బోధించు బాప్తిస్మమున కవి కేవలము వ్యతిరేకమైనవి. గనుక సాతాను సంబంధమైన క్రియలని గ్రహించవలెను. చిలకరింపు గాని, కుమ్మరింపుగాని పొందిన వారెన్నడును యేసుక్రీస్తు ఆజ్ఞాపించిన బాప్తిస్మమును పొందలేదు. వారు క్రీస్తుకు కాదు గాని మానవాచారములకు విధేయత

చూపించిన వారవుదురు. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని మత్తయి 15:9లో యేసు చెప్పుచున్నారు.

గనుక మిత్రులారా, బాప్తిస్మమును గూర్చిన సత్యమును ఎరుగక ముందు మీరు సహృదయంతోనే చిలకరింపు గాని, కుమ్మరింపుగాని పొంది యుండవచ్చును, అయితే అవి ఎన్నడు వాక్యప్రకారమైన బాప్తిస్మము కానేరవు. "మీరు సత్యమును గ్రహించెదరు, అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" అని యేసు యోహాను 8:31లో చెప్పెను. బాప్తిస్మమును గూర్చిన సత్యాన్ని ఈరోజు మీరు గ్రహించిన యెడల, మానవకల్పిత మతాచారముల నుండి మీరు స్వతంత్రులు కావలెనని కోరుచున్న యెడల ఈనాడే స్వతంత్రులు కాగలరు.

ఎన్ని బాప్తిస్మములున్నవి? యనే సందేహము మీకు రావచ్చును. ఎఫెసీ 4:5లో చూచిన, ప్రభువు ఒక్కడే, విశ్వాస మొక్కటే, బాప్తిస్మము ఒక్కటే అని వ్రాయబడి యున్నది. ఆ ఒక్కటే బాప్తిస్మము నీటిలో ముంచడము ద్వారా జరిగే బాప్తిస్మము. అది క్రీస్తు ఆజ్ఞాపించినది, మనుష్యులు లోబడవలసినట్టి బాప్తిస్మము (మత్తయి 28:19, 20). మనుష్యుల ద్వారా జరిగించబడవలసిన క్రియ అది. అందువలననే లోకమందంతటా క్రీస్తు సంఘస్తులు అనుదినము సువార్తను బోధించుచు, మారుమనస్సు బొందిన విశ్వాసులకు రాత్రి అనక, పగలనక బాప్తిస్మమిచ్చు చుండుట మీరు గమనించే యుంటారు. క్రీస్తు వాక్యప్రకారము మీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందగోరిన యెడల మీకు దగ్గరగా యున్న క్రీస్తు సంఘ సభ్యులనెవరినైనను దర్శించండి. బహు సంతోషముతో వారు మీకు బాప్తిస్మము నిచ్చెదరు. లేదా ఇప్పుడే మీ కోరికను తెలియజేస్తూ మాకొక ఉత్తరము వ్రాయండి. ఈ విషయములో మీరు ఆలస్యం చేయవద్దు సుమా !

❖ ❖ ❖ ❖

# క్రీస్తులో విజయము

## (Victory in Jesus)

ఆటలలోగాని, పందెములలో గాని విజయం సాధించు వానిని మనం తప్పక ప్రేమిస్తాం. భారతదేశపు క్రీడాకారులు ఆయా రంగములలో పోటీ చేయుచుండగా వారే జయించాలని మనం గాఢంగా కాంక్షిస్తాము. అయితే ఒకరికి విజయం చేకూరితే మరొకరికి పరాజయం సంభవిస్తాది, గాని అన్నింటికంటె గొప్ప పందెము ఒకటి యున్నది. దానిలో కావాలంటే అందరు విజయాన్ని సాధించ వచ్చును.

అపో.పౌలు తరుచు పందెములను గూర్చి వ్రాసేవాడు. "పందెపు రంగమందు పరుగెత్తువారందరు పరుగెత్తుదురు గాని యొక్కడే బహుమానము పొందునని మీకు తెలియదా? అటువలె మీరు బహుమానము పొందునట్లుగా పరుగెత్తుడి" యని అతడు వ్రాసాడు (1 కొరింథీ 9:24). అయితే ఈ పందెము ఒక క్రీడా స్థలములో పరుగెట్టేది కాదు; గాని అది క్రైస్తవ జీవిత పందెము. మనం యేసు వైపు చూచుచు మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తవలెనని మనకు హెచ్చరిక చేయబడింది (హెబ్రీ 12:2). "అయినను మన ప్రభువైన యేసు క్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగునుగాక" (1 కొరింథీ 15:57). క్రీస్తులో యుంటే ఈ పరుగులో మనమందరం విజయం సాధించగలము. మనలను ప్రేమించిన వాని ద్వారా మనం వీటన్నిటిలో అత్యధిక విజయం పొందగలము (రోమా 8:37).

### అపరాధము నుండి

పాపపు అపరాధము నుండి క్రీస్తు మనకు విజయము నిచ్చును. ఈ లోకంలో మనకున్న గొప్ప సమస్య పాపము. నిజానికి మనకున్న యితర సమస్యలన్నీ పాపము యొక్క పర్యవసానములే. మనం పాపాన్ని జయించకపోతే, జీవితంలో సాధించిన ఇతర విజయాలు తమ భావాన్ని కోల్పోతాయి. పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని చెప్పబడింది (యోహా 8:34). పాపి, తన్నుతాను రక్షించుకో లేడు (యిర్మీయా 10:23). గనుక ఈ సందర్భంలో దేవుడు తన అద్వితీయ కుమారుని

ద్వారా తన ప్రేమను కనబరచాడు. మనం పాపము చేసినందు వలనను, పాపము వలన కలుగు జీతము మరణమై నందువలనను, "దేవుని కృప వలన ఆయన ప్రతి మనుష్యుని కొరకు మరణం అనుభవించారు" (హెబ్రీ 2:9). ఆయన సిలువపై మరణించినప్పుడు మన విమోచనార్థమై తన రక్తాన్ని చిందించారు (1 పేతురు 1:18, 19). క్రీస్తు తన రక్తము వలన పాపముల నుండి మనలను విడిపించారు (ప్రక 1:6), మనలను కడిగి, క్షమించారు (ఎఫెసీ 1:7). మనమాయన ఆజ్ఞలకు లోబడి జీవిస్తే పాపముపై మనం విజయాన్ని సాధించగలము (మార్కు 16:16; రోమా 6:3-4).

## అభ్యాసము నుండి

పాపము యొక్క అభ్యాసము నుండి క్రీస్తు మనకు విజయము నిస్తారు. మనం క్రీస్తు రక్తంలో కడుగబడినప్పుడు పాపముపై మనం సాధించిన విజయం ఇంకా సంపూర్తి కాలేదు. మనం పాపము యొక్క అభ్యాసముపై విజయాన్ని సాధించాలి. "జీవించు వారికమీదట తమకొరకు కాక, తమ నిమిత్తము మృతి పొంది తిరిగి లేచిన వాని కొరకే జీవించాలని నిశ్చయించుకొనాలి" (2 కొరి 5:15). మనం ఆయన కొరకు ప్రతి దినం జీవించడానికి ప్రయత్నించుటలో ఆయన రక్తము మనలను ప్రతి పాపము నుండి శుద్ధిచేయును (1 యోహాను 1:7).

మనం పాపం చేసినప్పుడు మారుమనస్సు నొంది ఆయన క్షమాపణ వేడుకొనాలి. మనం శోధింపబడినప్పుడు "సహింప గలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగ జేయును" (1 కొరి 10:13).

## పాపము నుండి

మనము క్రీస్తునందు నమ్మిక యుంచి, ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందినప్పుడు పాపమునుండి విడుదలన పొందితిమి (రోమా 6:4, 18). తద్వారా "మన మికను పాపమునకు దాసులము కాకుండుటకు పాప శరీరము నిరర్థకమగునట్లు మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని యెరుగుదుము" (రోమా 6:6). బుద్ధిపూర్వకముగా ఆయన చిత్తమును జరిగించుటకు మనలను మనం అప్పగించు కొన్నప్పుడు, పాపపు అభ్యాసముపై మన విజయం సంపూర్ణమవుతాది. "మీరు శరీరాను సారముగా ప్రవర్తించిన యెడల చావవలసిన వారై యుందురు గాని ఆత్మచేత శరీర క్రియలను చంపిన యెడల జీవించెదరు. "దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురని" పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నారు (రోమా 8:13, 14). మన మాయనవారమై నప్పుడు ఆయన కొరకు

జీవించే లాగున ప్రభువు మనకు సహాయం చేయును.

## మరణము నుండి

మరణముపై క్రీస్తు మనకు విజయము ననుగ్రహిస్తారు. ఆదాము నుండి ఇప్పటివరకు జీవించిన వారందరు, ఒకడు మరణించిన యెడల అతడు తిరిగి బ్రతుకునా? యనే ఆలోచనలో యున్నారు (యోబు 14:14). క్రీస్తు కాలము వరకు ఈ మరణపు బాట ఒకేవిధంగా యుండెను. గాని యేసుక్రీస్తు మరణించి తిరిగి లేచారు! ఆయన యందు నమ్మిక యుంచు వారికి మరణ భయము ఇక లేదు. ఏలయనగా "జీవిత కాలమంతయు మరణ భయము చేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకు" ఆయన మరణించి తిరిగి లేచారు (హెబ్రీ 2:15).

క్రీస్తు నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా మృతులలో నుండి లేపబడి యున్నారు (1కొరి 15:20). విశ్వాసి యొక్క నిర్ధారణను అపొ.పౌలు ఇట్లు చెబుతున్నాడు: "యేసు మృతి పొంది తిరిగి లేచెనని మనము నమ్మిన యెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును" (1 థెస్స 4:14). ఆయన పునరుత్థానము మన పునరుత్థాన వాగ్దానమై యున్నది, ఆయన తిరిగి లేచాడని ఎంత దృఢముగా మనము నమ్ముదుమో అంత దృఢముగానే ఆయన మనలను లేపునని, ఆయనతో కూడ యుండుటకు మనలను కొని పోవునని నమ్ముదును.

"మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను" (హెబ్రీ 9:27). అయితే క్రైస్తవునికి మరణ భయము లేదు. పౌలువలె "నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే, చావైతే లాభము" అని యతడు చెప్పును (ఫిలి 1:21). క్రీస్తు మన కొరకు స్థలము సిద్ధపరచుచున్నాడనే విశ్వాసము కలిగి యున్నప్పుడు, మరణమును గూర్చి మనం ఎందుకు భయపడాలి? (యోహాను 14:1-3). క్రైస్తవుడు తన జీవితాన్ని సంపూర్తిగ క్రీస్తు కొరకు జీవించునప్పుడు మరణ భయం ఇక ఉండదు. "విజయమందు మరణము మ్రింగివేయ బడెను అని వ్రాయబడిన వాక్యము నెరవేరును.... అయినను మన ప్రభువైన యేసు క్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక !" (1 కొరి 15:54-57).

నీవు విజేయుడవు కావచ్చును, ఎప్పుడు? క్రీస్తునందున్నప్పుడు మాత్రమే. ఆయనను నమ్మి బాప్తిస్మము పొంది క్రీస్తులోనికి ఈనాడే ప్రవేశించుము. జయజీవితము నారంభించుము.

✍ - జాషువా గూటం

# బోధకులు ప్రార్థనా పరులై యుండాలి

బోధకులు దేవుని వర్తమానము నందించు దేవుని పనివారు గనుక వారు దేవునితో తరచు మాట్లాడాలి: అపొ.పౌలు తిమోతిని "విజ్ఞాపనములును, ప్రార్థనలును, యాచనలును కృతజ్ఞతాస్తుతులును చేయవలెనని హెచ్చరించెను" (1తిమోతి 2:2). అన్నిటికంటె ముఖ్యముగా మనము ప్రార్థించాలని పౌలు హెచ్చరించెను.

బోధకులకు దేవుని సహాయం ప్రత్యేకముగా అవుసరం. వారు శోధనను జయించి నమ్మకముగా యుండునట్లు ఆయన సహాయం అవుసరం. మానవులే గనుక బోధకులు కూడా అపవాది వలన శోధింపబడుదురు. బోధకులను నాశనం చేయాలని అపవాది ఎల్లప్పుడు ప్రయత్నం చేయుచుండును. ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను యేసు తన శిష్యులకు బోధించారు. "మీరు శోధనలో ప్రశేశించ కుండునట్లు మెలకువగా యుండి ప్రార్థన చేయుడి" యని ఆయన తన శిష్యులను హెచ్చరించారు (మత్తయి 26:41). పలుకు బడి కొరకు కొందరు బోధకులు అసత్య ముతో రాజీపడ్తారు, అబద్ధ బోధలు చేస్తారు. కొందరు ధనాపేక్ష కలిగి ఎవరు డబ్బు యిస్తే వారి బోధలు చేస్తారు. ఒక బోధకుడు పేరుగాంచిన వాడైతే వానిలో అహంభావము పెరుగుతాది, మరికొంత మందిలో అసూయ, ద్వేషము మొదలగునవి మొలకెత్తుతాయి. అందువలన అపవాది యొక్క తంత్రములకు లోబడకుండునట్లు బోధకులు ప్రార్థనాపరులై యుండాలి.

బోధకులు దేవుని సత్యవాక్యమును విస్తరింప జేయుటకు ఆసక్తి కలిగి యుండాలి. అనేకులకు సత్యం అవుసరం గనుక మనమొక్కరమే ఆ పనిని చేయలేము. అందువలన యేసు, "కోత విస్తారమే గాని పనివారు కొద్దిగా ఉన్నారు. గనుక తన కోతకు పనివారిని పంపుమని కోత యజమానుని వేడుకొనుడని తన శిష్యులతో చెప్పెను" (మత్తయి 9:37-38). నశించిన వారి ఆత్మల రక్షణను కోరు బోధకులు ఎక్కువమంది పనివారి కొరకు ప్రార్థించాలి. ఆలాగే సత్యవాక్యమును బోధించు ప్రతి బోధకుని మనం ప్రోత్సహించాలి.

బోధకులు ఎందుకు ప్రార్థనాపరులై

యుండాలో మరికొన్ని కారణములు :

1. క్రీస్తు మాదిరి ననుసరించుట కొరకు : ఆయన తరుచు ప్రార్థించారు, తీవ్రముగా ప్రార్థించారు.

"ఆయన జన సమూహములను పంపివేసి, ప్రార్థన చేయుటకు ఏకాంతముగ కొండ యెక్కి పోయి, సాయంకాలమైనప్పుడు ఒంటరిగా యుండెను" (మత్తయి 14:23).

"ఆయన ప్రార్థన చేయుటకు అరణ్యములోనికి వెళ్లుచుండెను" (లూకా 5:16).

యేసు తాను అప్పగింపబడక ముందు గెత్సెమనెలో తీవ్రముగా ప్రార్థించెను (మత్తయి 26:36-46).

2. అపొస్తలుల మాదిరి ననుసరించుట కొరకు : వివిధ ప్రదేశాల్లో యున్న సంఘము కొరకు పౌలు ప్రార్థించెను (రోమా 1:9; కొలస్స 4:12).

మధ్యాహ్న కాలమందు పేతురు ఆకలిగొని యుండినను అతడు ప్రార్థనలో గడిపెను (అపొ.కా. 10:9).

పౌలు, సీలాలు అర్ధరాత్రివేళ జైలులో ప్రార్థించుచుండిరి (అపొ.కా. 16:25).

3. బోధకులు యితర మత నాయకుల నుండి వ్యతిరేకతను, హింసను ఎదుర్కొనుదురు.

'మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి" యని యేసు బోధించెను (మత్తయి 5:44). యూదా మత నాయకులు భయపెట్టినను వాక్యమును ధైర్యముగా బోధింప గలుగునట్లు పేతురు ప్రార్థించెను (అపొ.కా. 4:29). స్తెఫను రాళ్లతో కొట్టబడి చంపబడుచున్నప్పుడు, "అతడు మోకాళ్లూని ప్రభువా వారి మీద ఈ పాపము మోపకుమని" ప్రార్థించెను (అపొ.కా. 6:60).

4. తమ పనిలో ఎదుర్కొను సమస్యలను బట్టి బోధకులు ప్రార్థించాలి : మన పనిని మంచి మనస్సుతో చేయుచున్నను కొన్నిసార్లు సమస్యల నెదుర్కొందుము. అప్పుడేమి చేయాలో మనకు తెలియదు. గాని జ్ఞానము కొరకు దేవుని అడగాలి (యాకోబు 1:5).

దేవుడు మనకు చేసిన సహాయం కొరకు ఎల్లప్పుడు కృతజ్ఞత చెల్లించాలి. ఆయన సమయోచితమైన సహాయం కొరకు ప్రార్థించాలి.

5. ఈలోక బాధలు ఎక్కువైనప్పుడు

ప్రార్థించాలి: ఈలోక యాత్రలో ఎప్పుడో ఒకప్పుడు సమస్యలెదురవుతాయి. ఈ జీవితం సాధక బాధకములతో నిండి యున్నది. ఒక్కోసారి ఆనారోగ్యం సంభవింపవచ్చు. ప్రతివారికీ ఏదో ఒక ఆర్థిక సమస్య ఉంటాది. మిగతావారి వలె బోధకులకును ఈ సమస్యలుంటాయి. అందుకే "ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీచింత యావత్తు ఆయన మీద వేయుడి" యని 1 పేతురు 5:7లో వ్రాయబడి యున్నది. "దేనిని గూర్చియు చింత పడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ హృదయములకును, తలంపులకును కావలి యుండునని" ఫిలిప్పీ 4:6-7లో వ్రాయబడి యున్నది. ఎవరికైనా సమస్యలొస్తే ఈ మాటలు తరుచు మనం చెబుతాము. మన యెడల కూడ అదే దేవుని చిత్తము. దానిని అనుసరించాలి.

6. బోధకులు కొన్నిసార్లు నిరుత్సాహ పడుదురు, అలయుదురు : గాని "మనము మేలు చేయుట యందు విసుగక యుందము. మనము అలయక మేలు చేసితిమేని తగిన కాలమందు పంట కోతుము" (గలతీ 6:9). మనుష్యులు విసుగక నిత్యము ప్రార్థన చేయవలెనని యేసు హెచ్చరించిన సంగతి జ్ఞాపక ముంచుకొనాలి (లూకా 18:1). మనం ఏ విధమైన నిరుత్సాహాన్ని ఎదుర్కొనినా ప్రార్థించుట మరువరాదు.

7. బోధకులుగా మన కృషికి విస్తారమైన ఫలితం లభించాలని కోరుకొందుము. ప్రార్థించండి! అనేక ఆత్మలు రక్షించబడాలని మన కోరికయై యున్నది. దేవుని పని ఇంకా బలముగా ముందుకు కొనసాగాలని కాంక్షిస్తాము. తరుణములనేకములు మనకు దొరకాలను కొంటాము. వీటిని గూర్చి ప్రార్థించండి! వాక్యము చెప్పుటకు అనుకూలమైన సమయము దేవుడు మీకు దయచేయు నట్లు యితరులు కూడా ప్రార్థించేలాగున వారిని ప్రోత్సహించండి (కొలస్స 4:4).

ప్రార్థించడానికి సమయం లేని బోధకుడు, బోధకుడు కాదు !

✍ - చార్ల్స్ స్కాట్

❖ ❖ ❖ ❖

# రాహేలు, లేయా

## (Rachel and Leah entangled in Unhappy Circumstances)

తన అన్నయైన ఏశావు ఉగ్రత నుండి తప్పించుకొనుటకు గాను యాకోబు తన మేనమామ అయిన లాబాను దగ్గరకు పారిపోవుటకు హారాను దేశమునకు బయలు దేరెను. మార్గ మధ్యలో చీకటి పడినందున అచ్చట యొక రాయిని తలగడగ చేసికొని పరుండి నిద్రించుచుండగా అతడు ఒక కలకనెను. ఆ కలలో యెహోవా దేవుడు అబ్రాహాము, ఇస్సాకులకు వలెను యాకోబు నకును వాగ్దానమను గ్రహించెను (ఆది.కా. 28:13-15). భూమి యొక్క వంశము లన్నియు నీ మూలముగాను నీ సంతానము మూలముగను ఆశీర్వదింపబడును. యాకోబు ప్రయాణాలు చేసి హారాను పట్టణమునకు చేరి తన మేనమామ కుమార్తెయైన రాహేలును కనుగొని ఆమెను ముద్దు పెట్టుకొని యేడ్చెను. తరువాత లాబాను యింటికి వెళ్ళి ఒక నెల లాబాను కొరకు పనిచేసి ఆ తరువాత రాహేలును ప్రేమించినవాడై ఆమె కొరకు ఏడు సంవత్స రములు కొలువుచేయుటకు లాబానుతో షరతు కుదుర్చుకొనెను.

యాకోబు రాహేలును యెక్కువగా ప్రేమించుటచేత ఏడు సంవత్సరములు కొలువు అతనికి బహు కొద్ది దినములుగా అగు పించెను. అయితే గడువు దినములు సమాప్తి అయినపుడు లాబాను తన చిన్న కుమార్తెయైన రాహేలుకు బదులుగ పెద్ద కుమార్తెయైన లేయాను యాకోబునకు భార్యగా యిచ్చెను (ఆది.కా. 29:21-30). దీవెన కొరకు తండ్రిని మోసగించిన యాకోబు మామయైన లాబాను చేత మోస మును రుచిచూచెను. అయితే లాబాను తన చిన్న కుమార్తెయైన రాహేలును కూడ యాకోబునకు భార్యగ యిచ్చుట కంగీ కరించి ఆమె కొరకు మరి ఏడు సంవత్సర ములు కొలువు చేయు మనెను. యాకోబు రాహేలును ప్రేమించుటచే అందుకంగీ కరించెను. యాకోబు, లేయా, రాహేలుల గృహములో శాంతి, సమాధానములు లేవు. ఇది మనము అనుసరింప దగినది కాదు.

లేయా రాహేలు ఒకరిని ఒకరు ద్వేషించుకొనుచూ, ఒకరిని చూచి మరి యొకరు అసూయపడుచుండిరి. రాహే లును యెక్కువగ యాకోబు ప్రేమించు టను బట్టి లేయా, తనకు సంతానము

కలుగకుండ అక్కయైన లేయా సంతానమును పొందుటను చూచిన రాహేలు అసూయాతో వారి గృహములు నిండి సంతోషము, నెమ్మది లేదు. మత్సరము ఎముకలకు కుళ్ళు (సామె 14:30). ఈ మత్సరము ఆత్మీయాభివృద్ధి చెందుటకు యే విధముగను కూడ దోహదకారి కాదు. కనుక ఇట్టి దుర్గణమును కలిగియుంటె దానిని వేరులతో పెరికి వేయాలి. ఆ దినములలో పుత్రదాతవృక్షపు పండ్లు తినిన సంతానము కలుగునెనెడి అపోహ ప్రజలలో కలదు. ఒక దినము లేయా పెద్దకుమారుడైన రూబేరు పొలములోనికి వెళ్ళి అచ్చట నుండి కొన్ని పుత్రదాతవృక్షపు పండ్లను చూచి కొన్ని తెచ్చి తన తల్లియైన లేయాకిచ్చెను. అది చూచిన రాహేలు తన అక్కను కొన్ని పండ్లు తనకీయమని అడుగగా (ఆది.కా. 30:14, 15), నాభర్తను తీసికొంటివే అది చాలదా? ఇప్పుడు నాకుమారుని పుత్రదాతవృక్షపు పండ్లు తీసుకొందువా? అని చెప్పెను. అందును బట్టి వారిరువురును ఒక షరతు కుదుర్చుకొనిరి. అటువంటి గృహము ఎంత ఘోర పరిస్థితి నెదుర్కొనునో మనము ఊహించ గలము. ఇటువంటి అసూయ ద్వేషములను కలిగియుండుట పాపము. వారు దేవుని రాజ్యమును స్వతంత్రించు కొనలేరు (గలతీ 5:21). కనుక ఇట్టి దర్గుణములను కలిగియుండ కూడదు. ప్రేమ దీర్ఘకాలము సహించును. దయ చూపించును. ప్రేమ మత్సరపడదు (1 కొరింథీ 13:14). కనుక తోటి మానవుని, దేవుని ప్రేమించే వ్యక్తి హృదయములో మత్సరముండదు. దేవుని ప్రేమిస్తూ తన పొరుగు వానిని కూడ ప్రేమించగలిగే వ్యక్తి తాను చేపట్టే కార్యకలాపములోనైనా సరే జయమును పొందగలడు. ఎదుటివారిని చూచి ఓర్వలేని వ్యక్తి తన నాశనమును తానే కొని తెచ్చుకొనును.

యాకోబుచే యెక్కువగా ప్రేమింపబడిన భార్య రాహేలు. ఆమె యెక్కువ సౌందర్యముగల వ్యక్తి. యాకోబును రాహేలు కూడ గాఢముగ ప్రేమించెను. కారణం ఆమె కొరకు యాకోబు 5,110 దినములు లాబానుకు కష్టపడి పనిచేసెను (ఆది.కా. 30:27). నిన్ను బట్టి యెహోవా నన్ను ఆశీర్వదించెనని లాబాను ఎరిగిన వ్యక్తి (ఆది.కా. 32:10). నీవు నీ సేవకునికి చేసిన సమస్త సత్యమునకును, ఉపకారమునకును అపాత్రుడను. దేవుని యెడల ఎంతో వినయము భయభక్తులు గలవాడు. రాహేలు తనకు సంతానము కలుగకుండుట వలన

యాకోబుతో నాకు గర్భఫలము నిమ్ము, లేనియెడల నేను చచ్చెదననెను (ఆది.కా. 30:1). యాకోబు కోపము రాహేలు మీద రగులుకొని నేను నీకు గర్భఫలము ఈయ దేవునికి ప్రతిగా నున్నావా? అనెను. రాహేలుకు దేవునియందలి విశ్వాసము లేదు. అందుచే యాకోబును నిందించు చున్నది. తన తండ్రియైన లాబాను యింట నుండి గృహదేవతలను దొంగిలించుట ద్వారా తండ్రిని మోసగించెను (ఆది.కా. 31:30-34). దీనిని బట్టి ఆ గృహములో వేదన కలిగెను. చివరిగా దేవుడు రాహేలును జ్ఞాపకము చేసికొని ఆమె మనవి విని ఆమె గర్భము తెరచినందున క్రీస్తుకు ముంగు ర్తుగా యుండగలిగిన యోసేపును కనెను (ఆది.కా. 35:16-20).

తన భర్తచే ప్రేమింపబడలేని భార్య లేయా. ఈ లేయా జీవితమంతా ఒక విధమైన వేదనతోను, అసంతృప్తితోను నిండి యున్నది. ఆమె రాహేలు అంత సౌందర్యవతి కాదు. భర్తచే ప్రేమింపబడ లేదు. ఆమె యొక్క దీనస్థితిని బట్టి దేవుడా మెకు ఆరుగురు కుమారులను, ఒక కుమా ర్తెను అనుగ్రహించెను. భర్తచే ద్వేషింపబడు చున్నప్పటికిని ఎంతో సహించి, ఓర్పుతో తన భర్త ప్రేమకొరకు కని పెట్టుచుండెను. బిడ్డలను కనుచూ వారి కొరకు శ్రమించి పనిచేయు చుండెడిది. వారిని కొంత క్రమ శిక్షణలో పెంచగలిగింది. తన యిరుగు పొరుగువారి యెడల ఆమె దయ, దాతృ త్వము కలిగి యున్నది. లేయా యొక్క కొన్ని సద్గుణములను బట్టి తన కుమా రుడైన యూదా గోత్రములో నుండి యేసుక్రీస్తు జన్మించెను.

✍ - లోటీ బెత్ హోబ్స్

❖ ❖ ❖ ❖

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' టి.వి. కార్యక్రమములను ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు **MAA** టి.వి. లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు **తేజ ఛానల్** లోను చూడండి.

# ఇదిగో ఈ మనుష్యుడు

**(Behold the man)**

పిలాతుకు అధికారం అప్పగింపబడింది. ఆ సమయానికి ఆ స్థలంలో ఉన్నాడు. అతడు యూదుల వల్ల పదేపదే ఒత్తిడి చేయబడ్డాడు. ఇప్పుడు తిరగుబాటు దారుడు, హంతకుడునైన బరబ్బాను విడుదలచేసి ఎవని యందు ఏ దోషము కానరాలేదో ఆ వ్యక్తిని చంపుటకు ఒత్తిడి చేస్తున్నారు. ఆతని సంశయం? శాంతిని కాపాడడం తన కర్తవ్యం. న్యాయము తెలుపుటకు నియమింపబడ్డాడు. నిర్దోషియైన వ్యక్తిని ఉరికి పంపడమంటే హత్యానేరంలో తాను కూడా భాగస్తుడే. గాని శాంతి ఏర్పడక పోతే రోమ్ యొక్క ఆగ్రహాన్ని ఎదుర్కోనాలని అతనికి లేదు. ప్రస్తుత స్థితిలో యేసు ప్రభువు నేరస్థుడవుటే సరియైన రాజకీయ చర్యగా అతడు గ్రహించాడు. గాని మరణమునకు తగిన హేతువేమి ఈ మనుష్యునిలో లేదని ప్రకటించుటకు పరిస్థితుల తనిని బలవంత పెట్టాయి. అది పరిస్థితులను చక్కచెట్టవలసిందిగాని అలాజరగ లేదు. పిలాతు యేసు ప్రభుని గూర్చి "ఆతడు దోషికాడు" అన్నాడు. గాని సంశయించాడు.

యేసు ప్రభువును చంపడం కోసం కేకలు వేస్తున్న వారి మనసులు పిలాతు మార్చలేడు. తన మూఢనమ్మకాన్ని బట్టి వారి ఒత్తిడికి తలవొగ్గకుండానే యేసు ప్రభువును కొరడాలతో కొట్టుటకు అప్పగించాడు. కొరడాలతో కొట్టడం క్రూరమైన, ప్రాణాంతకమైన కఠిన శిక్ష. నిందితుని బాధకు గురిచేసే ప్రధాన చర్య. పిలాతు ఆజ్ఞాపించగా సైనికులు ఇట్టి చట్టపరమైన హింస ప్రారంభించారు. తరువాత వారు ఒక ముండ్ల కిరీటమును అల్లి యేసు ప్రభువు తలపై పెట్టారు. అదనంగా వారు ఆయనకు ఊదారంగు వస్త్రం ధరింప చేసారు (యోహాను 19:2). గ్రంధాలను బట్టి చూస్తే యేసు ప్రభువు సైనికుల చేతిలో కొట్టబడడం ఇది రెండవ పర్యాయం. మొదటిసారి హేరోదు యొక్క ఆజ్ఞ ప్రకారం. తరువాత పిలాతు యేసు ప్రభుని వెలుపలికి తీసికొని వచ్చాడు. యేసు ప్రభువును నిందించుచున్నవారు, పిలాతుకు ఆయన యందు ఏ దోషము కనబడలేదని తెలిసికొనునట్లు అలాచేసాడు (యోహాను 19:3).

తరువాత పిలాతునుండి ఒక గంభీరమైన అసాధారణమై వివరణ వచ్చింది. ఈ వివరణలో అనేక విషయాలు

కనుగొనవచ్చు. ఉదాహరణకు - పిలాతు, ఎవరిని నిర్దోషి అని ఎంచాడో ఆ యేసు ప్రభువువే జాలికి నిదర్శనం. స్వభావంలో ఆయన నిర్దోషి. గాని ఆయన స్థానం విషాదం, విచారం. అయినప్పటికి యేసు ప్రభువుపై అతనికున్న జాలిలో తిరస్కారం కూడ ఉంది. తనను రాజుగా చెప్పుకొనుచున్న, సత్య మును గూర్చి సాక్ష్యమిచ్చు చున్నానంటున్నా ఈ మనుష్యుడు కొట్టబడి, గొలుసులతో కట్టబడి నిలువబడి ఉన్నాడు. గాని లొంగు బాటు లేదు. పిలాతు బయట పడడానికి యేసు ప్రభువు అవకాశం ఈయలేదు యూదులు ఇయ్యలేదు. గనుక యేసు ప్రభువు ఇచ్చిన సమాధానాలకు ఆందోళన చెందడం మాత్రమే గాకుండా, పిలాతు వివరణ నిర్దోషియైన ఈ వ్యక్తిని నిందించు చున్న వారికి తన విసుగుతో కూడిన సలహా ఉంది. పిలాతు వారి ఉద్దేశాలు చదవగలి గాడు, యేసు ప్రభువు యెడల వారికున్న ద్వేషాన్ని తృణీకరించాడు. "ఈ మనుష్యుని వైపు చూడండి.........."కొంత మానవత్వ ముతో సానుభూతితో అతని వైపు చూడ మంటున్నారు. గాని నిందించేవారు యేసు ప్రభువు యొక్క బాధవల్లగాని శ్రమ వల్లగాని స్పందించలేదు. వారికి ఈ వ్యక్తి పట్ల జాలికలుగలేదు, లేదా అతని దమ నీయస్థితిని లక్ష్యం చేయలేదు. నిర్దోషత్వం, స్వభావంలోని మంచితనం వ్యక్తిలోని హుందా తనం అనే ఆలోచనలను వారు రానియ్యలేదు. వారి విద్వేషపు, అక్రమ చర్యల పర్యవసానం గురించిన తలంపు లను రానీయలేదు. వారు తృణీకరించే బాధితుని పట్ల వారికి ఎట్టి కనికరము లేదు.

సుమారు 2000 సంవత్సరముల పూర్వం పిలాతు ఎదుట, యెరూషలేము ప్రజల యెదుట ప్రదర్శనలా నిలువబడిన అదే యేసు ప్రభువు సువార్తను వినే వారందరి యెదుట నిలుస్తున్నారు. పిలాతు మాటలు వాక్యము బోధింపబడుతున్న వారి కందరికి శక్తివంతమైన ఆహ్వానంలా ఇలా ప్రతిధ్వనిస్తున్నాయి. "ఇదిగో ఈ మనుష్యుడు"

✍ - రాన్ బ్రాయన్ట్

❖ ❖ ❖ ❖

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

# దేవుడు తనను తాను మానవునికి ప్రత్యక్షపరచుకొనెను

**(God has revealed Himself to mankind)**

జగత్‌లో సృష్టింపబడిన వస్తువుల ద్వారా, (రోమా 1:20; కీర్తనలు 19:1-4) పరలోకపు యెహోవా దూతల ద్వారా (న్యాయాధిపతులు 13:2-4; గలతీ 3:19), ఆయన దూతల ద్వారా దేవుడు తనను తాను మానవునికి బయలు పరచుకొనెను. ఈ కడవది కాలంలో ఆయన యేసు క్రీస్తు ద్వారా బయలుపరచుకొనెను. యేసు ప్రభువు మానవ శరీరము ధరించి సుమారు 30 సం॥లు మానవుల మధ్య జీవించారు. ఆయన బోధలు, చేసిన అద్భుతాలు, ఆయన మరణపునరుత్థానాలు ఆయనను దేవుని కుమారునిగా ఋజువు చేసాయి (రోమా 1:4; హెబ్రీ 2:1-4) ఆయన శరీరధారియైన వాక్యము అని (యోహాను 1:14; హెబ్రీ 2:1-4). ఆయనను గూర్చి లేఖనములు చెబుతున్నవి. క్రీస్తు ప్రభుని చూచినట్లయితే తండ్రిని చూచినట్లే (యోహాను 14:9). క్రొత్తనిబంధన లేఖనముల ద్వారా తండ్రి యొక్క చిత్తమును సర్వలోకమునకు క్రీస్తు బయలు పరిచారు (యోహాను 14:26; 16:13; హెబ్రీ 1:1,2; 11పేతురు 1:3; 20,21).

క్రొత్తనిబంధన గ్రంధము తనపుటలలో కేవలం జీవము భక్తికి సంబంధించిన విషయములనే గాక (11 పేతురు 1:3), ఈ లేఖనములు దేవుని స్వభావమును, ఈ దినాలలో మానవులందరి యెడల ఆయన పవిత్ర ఉద్దేశ్యమును తెలియజేయుచున్నవి (కొలస్స 1:15; 11కొరింధి 4:4; హెబ్రీ 1:1-15; 11కొరింధి 5:19).

ప్రభువును గురించి, ఆయన కృపను గురించి, మరియు ఆయనను ప్రేమించుచు ఎట్టి అనుమానము, సందిగ్ధము లేకుండా ఆయన యెడల విశ్వాసము కలిగియున్న మానవులందరి యెడల ఆయన తీసికొను శ్రద్ధసక్తులను గురించి రాయుటకు పరిశుద్ధాత్మ దేవుడు కీర్తనా కారుడిని ఉత్తేజ పరిచాడు (కీర్తన 33:4-22; 34:1-10). క్రైస్తవులు క్రీస్తు ప్రభు బోధలకు నమ్మకంగా విధేయులైతే వారిలో తాను, తండ్రీ కూడా ఆత్మీయంగా నివసిస్తామని క్రీస్తు ప్రభు మానవ జాతికి వాగ్దానం చేసారు (యోహాను 14:21, 23). ఒకడు దేవుని దృష్టిలో నీతిమంతుడుగా ఉండాలి అంటే ఆ వ్యక్తి దేవుని వాక్యమునకు తప్పక విధేయత చూపాలి అనేది గుర్తుంచుకోవాలి (11 కొరింధి 5:19-21; రోమా 1:16,17; 8:1,14;

గలతీ 3:26, 27). నీతిమంతునికి దేవునితో సంబంధమును గూర్చి కీర్తన కారుడు ఏమి చెబుతున్నాడో చూడు (కీర్తన 37:25).

మానవులమైన మనము దేవుని వలన అంగీకరింపబడునట్లు లేఖనములు చదవాలి (11 తిమోతి 2:15).

ఆయనకు విధేయులైన వారినే క్రీస్తు రక్షించును (హెబ్రీ 5:8,9)

✍ - డాన్ నార్వుడ్

❖ ❖ ❖ ❖

# "నేను పునరుత్థానమును"

## (I am the Resurrection)

దుఃఖాక్రాంతురాలై గుండె పగిలి రోదిస్తున్న స్నేహితురాలికి ఒక అద్భుతమైన వార్తను లోకమంతటికి కొరకై యేసు ప్రభువు తెలిపారు. మార్త సోదరుడైన లాజరు మృతిచెందాడు. ఆమె చేస్తున్న ఒకే ఒక వాదము ఏమంటే, ఆయన అక్కడ ఉండి ఉంటే తన సోదరుడు మృతి చెంది ఉండేవాడు కాదు అని. "నీ సహోదరుడు తిరిగి లేస్తాడు" అని యేసు ప్రభువు ఆమెకు అభయ మిచ్చారు. దేవుని యందు గొప్ప విశ్వాసమున్న స్త్రీ మార్త. అంత్యదినమున పునరుత్థానమందు లేచునని నేనెరుగుదును అని ఆమె సమాధానం. అతడు, అతనితో పాటు మృతులందరు తప్పని సరిగా పునరుత్థానమందు తిరిగి లేస్తారు. సమస్త మును చేయగల సమర్థుడైన దేవుని యెడల గల విశ్వాసాన్ని వ్యక్తపరచిన ఆ వ్యధా మధురమైన క్షణంలో దైవపుత్రుని పెదవుల నుండి "పునరుత్థానమును జీవమును నేనే, నాయందు విశ్వాసముంచు వాడు చని పోయినను బ్రతుకును, బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు, ఈ మాట నమ్ముచున్నావా?" అని మెరుపులా వచ్చింది. ఆమె ఎలా నమ్మగలదు? ఇట్టి గంభీరమైన ఆధా రము యొక్క ప్రకటనను మనలో ఎవరు మాత్రం గ్రహించగలం? యేసు ప్రభువే జీవమునకు ఆధారం. అదే విధంగా ఆయనే పునరుత్థానము. ఆయనే పునరు త్థానము యొక్క అధికారం, శక్తి, ఆచరణ. ఆయన చిత్తము యొక్క జోక్యము లేకుండా ఏ ప్రాణియు కొనసాగదు.

అవును ప్రభువా! "ఈ లోకమునకు రానైయున్న దేవుని కుమారుడవైన క్రీస్తువని నేను నమ్ముచున్నాను" అన్నది. ఒక సుడి గాలిలా ఈక్రింది సంఘటనలు జరిగి పోయినవి. మరియ వచ్చింది. యేసు కన్నీళ్ల విడిచారు, యూదులు ఆయన ప్రేమపట్ల ఆశ్చర్యపడ్డారు. యేసు ప్రభువు ప్రార్ధించారు. వారు ఆతిని తొలగించారు.

అప్పుడు సమస్త విశ్వామూ కదిలి పోయేలా ఒక బిగ్గర కేక "లాజరూ బయటికి రా!". వాక్యము చాలా స్థిరంగా ఖచ్చితంగా రాయబడింది. "చని పోయినవాడు....వెలుపలికి వచ్చెను". చివరికి మన అందరి ప్రశ్న పునరుత్థానము; ఈజీవితం అయిపోయిన తరువాత ఏమైనా ఉందా? ఏమి లేకపోతే జీవితానికి ఇంత ప్రాముఖ్యం అక్కరలేదు.

జీవితం తరువాత ఏమి లేకపోతే పర లోకము లేదు, పునరుత్థానము లేదు, మనం ఉండడం అర్ధం లేనిది, మన ప్రవర్తనకు, మననీతికి, దేవుడున్నాడనుటకు అర్థమే లేదు గాని యేసు తానే పునరుత్థానము నని ప్రకటించెను.

**మూడు చీకటి దినాలు :** అసంపూర్ణమై విశ్వాసంతో యేసు ప్రభువు శిష్యులు మూడు చీకటి దినాలు దీనినంతటిని మననం చేసికొన్నారు. బోధకుడు తమతో చెప్పిన మాటలను గురించి వారు ఆలోచించారు. కొందరు అది అయిపోయింది అనుకొన్నారు. కొందరు రానైయున్న మూడవ దినం గురించి ఆశ్చర్యపడ్డారు.

తమ స్నేహితుని యొక్క ఘోరమైన, క్రూరమైన మరణం గురించి వారంతా కూడా వ్యధచెందారు. రక్షకునికి మేకులు కొడుతున్న సుత్తుల ధ్వని వారి చెవులలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. నిస్సహాయత, భయం, కన్నీరు, కిరీటం, అవమానం, చీకటి, రక్తం అయినా, వీటన్నిటికీ పైన వారి దుఃఖమంతటికి మించి ఒక చిన్న వెలుగు కిరణంలా ఒక చిన్న ఆశాకిరణం.

**రాయి దొర్లింపబడెను :** అప్పుడు జరిగింది – మేరి మగ్దలేని సమాధి యొద్దకు వెళ్లి రాయి కదలింపబడి ఉండుట చూచింది అని యెహాను గ్రంధస్తం చేసాడు. పేతురు యోహానుల యొద్దకు ఆమె పరిగెత్తింది. ఆమె చెప్పిన విషయాలు వాస్తవాలే గాని ఆమె ముగించిన విధం సరియైనది కాదు. "ప్రభువును ఎవరో సమాధి నుండి ఎత్తుకొని పోయారు, ఆయనను ఎక్కడ ఉంచిరో మాకు తెలియదు" అన్నారు. వారంతా సమాధి వద్దకు పరిగెత్తి అక్కడ ప్రేత వస్త్రాలు మాత్రం చూసారు. యెహాను లోనికి వెళ్లాడు. వారు ఈ విషయాలను గురించి చర్చించుటకు ఇంటికి వెళ్లారు.

గాని మరియ వెళ్లలేదు. ఆమె సమాధి వద్ద ఏడుస్తూ ఒక అపరిచిత వ్యక్తికి చెబుతూ ఉంది, "నా ప్రభువును ఎవరో ఎత్తుకొని పోయారు. ఆయనను ఎక్కడ ఉంచిరో నాకు తెలియలేదు" (యోహాను 20:13). అంతట ఆ అపరిచిత వ్యక్తి మాట్లాడాడు. ఆయన ఆమెతో మాట్లాడిన విధం నేను వినాలని ఎంతో ఆశపడుతున్నాను. "మరియా!" అప్పుడు తెలిసికొంది ఆమె, అతడు అపరిచితుడు, తోటమాలి, భూమిని సాగుచేసే వాడుకాదని, ఒక అద్భుతమైన, శక్తివంతమైన నిజస్థితిలో తాను పునరుత్థానముతో మాట్లాడుతున్నట్టు తెలిసికొంది. విశ్వాసవంతురాలైన స్త్రీ ఈ ఉత్కంఠ కలిగించే వార్తతో శిష్యుల యొద్దకు వెళ్లింది. ఒక నమ్మలేని సాక్ష్యం. మొట్టమొదటి సువార్త పలుకులు "నేను ప్రభువును చూచాను"!

**యేసే పునరుత్థానం :** మహిమ గల ఆ ఉదయమున యేసు సమాధి నుండి లేచుట ద్వారా మరణాన్ని, పాపాన్ని, సాతానును జయించారు. అన్ని కాలములకు తానే పునరుత్థానము అని ఋజువు చేసారు. ఇట్టి ఆశ్చర్య శక్తికి మన హృదయాలలో సామాన్యం స్థానం ఈయ కూడదు. ఆయన దైవత్వమునకు ఇది చిట్ట చివరి ఋజువు. క్రైస్తవ నిరీక్షణ యొక్క అద్భుతమైన శక్తి. ఆయనకు కలిగిన విమోచన శక్తికి ఇది ఒక విజయవంతమైన ప్రదర్శన. మెస్సీయాను గూర్చిన ప్రవచన నెరవేర్పు ఇది. శిలువ యొక్క విలువ క్రీస్తు అనుచరుడుగా మారవలెననే నిర్ణయమే సంఘటనను సజీవ మైనదిగా చేయుచున్న ముఖ్యాంశము.

యేసు క్రీస్తు ప్రభువు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములు పాపముకై మన మరణంటిలో సమాధి, నూతనంగా జీవించుటకై తిరిగి లేపబడడం అనునవి స్పష్టంగా చూపబడినవి.

నోటితో ఒప్పుకొని రక్షింపబడుట చాలును అని కొందరుంటారు. ఏదిలేకుండా మనకు పాపక్షమాపణ వాగ్దానము లేదో ఆ పునరుత్థానమును బైబిలు క్రీస్తు కొరకు మన నిజమైన మార్పులోని దృశ్యమైన భాగంగా ఉంది.

ఆయనే పునరుత్థానము అని యేసు ప్రభువు చేసిన ప్రకటనే విమోచన యొక్క సారం. ప్రభువును కలసి కొనుటకు మనందరము తిరిగి లేస్తాము. శరీరంలో మరణించిన ప్రతి ఒక్కరం ఆత్మలో తిరిగి లేస్తారు. ఇది మన నిరీక్షణ. ఈ నిరీక్షణ పైనే మనం నిలబడతాం, జీవిస్తాం, ప్రకటిస్తాం. ఆయన లేచారు. ఆయన వస్తున్నారు. మనం లేస్తాం.

✍ - జాన్ డాట్స్

❖ ❖ ❖ ❖

## Declaration (See Rule 3)

| | | |
|---|---|---|
| Title of the News paper | : | Satya Vakku |
| Language | : | Telugu |
| Name & Address of the publisher | : | Joshua Gootam<br>10-4-33/1,<br>Seshagiri Rao St.,<br>Kakinada - 533 004. |
| Nationality | : | Indian |
| Name of the printer with address | : | Joshua Gootam<br>10-4-33/1,<br>Seshagiri Rao St.,<br>Kakinada - 533 004. |
| Place of printing with address | : | Satya Vani<br>Sambamurthy St.,<br>Kakinada - 533 001 |
| Place of publishing | : | Satya Vani<br>Church of Christ,<br>7-9-35<br>Sambamurthy St.,<br>Kakinada - 533 001. |
| Name of the Editor | : | Joshua Gootam(Indian)<br>10-4-33/1,<br>Seshagiri Rao St.,<br>Kakinada - 533 004. |

I, Joshua Gootam declare that particulars in respect of the News paper are true the best of my knowledge and belief.

Sd -

Joshua Gootam

వాక్యపరిచర్య చేసిరి. 25వ తేదీ శుక్రవారం ఉదయం అమెరికా సోదరులు రాబర్ట్ స్వెయిన్ గారు చక్కటి సందేశము నిచ్చిరి. ఆ రోజు ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కోటిపల్లి (పాత) కోటలో సోదరులు శీలం సామ్యూల్ రాజు గారు క్రీస్తు కొరకు నిర్విరామ కృషి చేయుచున్నారు.

ఫిబ్రవరి 27వ తేదీ ఆదివారం కాకినాడ సత్యవాణి - క్రీస్తు సంఘ ఆరాధనలో సోదరులు జె.సి.ఛోట్ గారు, వారి సతీమణి బెట్టీ ఛోట్ గారు మరియు రాబర్ట్ స్వెయిన్ గారు పాల్గొనిరి. రాబర్ట్ గారు వాక్యపరిచర్య చేసిరి. సంఘమును ప్రోత్సహించిరి. ఆరాధనకు ముందు ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

ఫిబ్రవరి 28వ తేదీ సోమవారం జగ్గంపేట మండలం Z-రాగంపేటలో నిర్మించబడిన ప్రార్థన షెడ్‌ను సోదరులు రాబర్ట్ స్వెయిన్ గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్ఠ చేసిరి. వాక్యపరిచర్య చేసిరి. జాషువా గారు వారి ఆంగ్ల ప్రసంగమును తెలుగున కనువదించిరి. హాజరైన వారందరికీ మంచి విందు ఏర్పాటు చేయబడెను. పలువురు సువార్తికులు, మత శాఖల బోధకులు హాజరైరి. రాగంపేటలో సోదరులు మల్లవరపు జోసఫ్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:

**SATYA VAKKU**
**P.O. Box 80,**
**Kakinada - 533 001**

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.